ప్రజా సంక్షేమానికే ప్రాధాన్యం

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- పిఠాపురంలో గడప గడపకూ మన ప్రభుత్వం


పిఠాపురంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

పిఠాపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమానికి ప్రాధన్యమిస్తూ పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. పిఠాపురం మున్సిపాలిటీ 6, 7, 9 వార్డుల్లో మంగళవారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అధికారులు ప్రజాప్రతినిధులతో కలిసి పట్టణంలో పర్యటించిన ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ప్రజల చెంతకే పాలనను తీసుకు రావడం కోసమే సచివాలయ వ్యవస్థను ఆచరణలోకి తీసుకొచ్చారన్నారు. సీఎం వైఎస్ జగన్ అన్ని వర్గాలకు సమ న్యాయం చేస్తూ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. ఎటువంటి పైరవీలు, రాజకీయాలు లేకుండా నేరుగా లబ్ధిదారులకు సంక్షేమ ఫలాలు అందేలా చేశారన్నారు. కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు బొజ్జా దొరబాబు, గండేపల్లి బాబి, అధికారులు పాల్గొన్నారు.

మునుపెన్నడూ లేనంత అభివృద్ధి

పిఠాపురం: స్థానిక మున్సిపాలిటీలో మునుపెన్నడూ లేనంత అభివృద్ధి చేసి చూపించామని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. మంగళవారం ఆయన పిఠాపురం మున్సిపల్ కార్యాలయంలో ఆధునీకరించిన మున్సిపల్ కమిషనర్ చాంబర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మున్సిపాలిటీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు, పట్టణాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికల ద్వారా చర్యలు తీసుకున్నారని చెప్పారు. కార్యక్రమంలో కమిషనర్ కృష్ణవేణి, మున్సిపల్ వైస్ చైర్మన్ పచ్చిమళ్ల జ్యోతి, గండేపల్లి బాబి, కొత్తపల్లి బుజ్జి, బోను దేవ, పెదపాటి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయాలి

అధికారులతో దవులూరి దొరబాబు సమీక్ష


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న దవులూరి దొరబాబు

సామర్లకోట: మండల పరిధిలో వివిధ పథకాల్లో మంజూరైన నిధులతో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు అధ్యక్షతన అభివృద్ధి పనులపై అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా దొరబాబు మాట్లాడుతూ గడప గడపకూ తిరిగిన సందర్భంగా వచ్చిన సమస్యల పరిష్కారానికి చేపట్టిన పనులకు నిధులు మంజూరు చేసినట్టు తెలిపారు. పాఠశాల అభివృద్ధికి నాడు-నేడు, ప్రతి గ్రామంలోను సచివాలయాలు, ఆర్‌బీకెలు, వెల్‌నెస్ సెంటర్ల నిర్మాణాలకు నిధులు మంజూరు చేసినట్టు తెలిపారు. వాటితో పనులు పూర్తి చేయాలని, చేసిన ప్రతి పనికి ఎంబుక్ తయారు చేసి కాంట్రాక్టర్లకు బిల్లులు వచ్చేలా చూడాలన్నారు. అమోదించిన ప్రతి పనికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నిధులు విడుదల చేస్తున్నారని తెలిపారు. మండల పరిధిలో మొదటి విడతగా మంజూరైన జి.మేడపాడు, వేట్లపాలెం, పవర గ్రామాల్లో జగనన్న కాలనీలు వేగంగా పూర్తి చేసి, డిసెంబరు నాటికి ప్రారంభోత్సవాలకు సిద్ధం చేయాలన్నారు. నిధులు సిద్ధంగా ఉన్నందున సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులతో గ్రామ పార్టీ నాయకులు ఆయా పనులపై దృష్టి సారించాలన్నారు. ప్రతి 15 రోజులకు ఒకసారి సమీక్ష ఉంటుందన్నారు. జగనన్న కాలనీలో సోప్‌బిట్లకు సంబంధించి ఉపాధి పథకంలో చేయించడానికి ప్రతిపాదనలు తయారు చేశామని ఎంపీడీఓ డి.శ్రీలలిత తెలిపారు. ఎంపీపీ సత్తిబాబు మాట్లాడుతూ మండల పరిషత్ నిధులతో పాటు రాష్ట్ర ప్రభుత్వం నుంచి మంజూరైన నిధులతో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలన్నారు. పీఆర్ డీఈ భాస్కరరమేష్, వైస్ ఎంపీపీ పేర్నిడి వెంకట్రాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు తాటికొండ అచ్చిరాజు, సొసైటీల అధ్యక్షులు వీరంరెడ్డి నాని, ఉటావాసు, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ మోరంపూడి రమేష్ ఆయా గ్రామాల సర్పంచ్‌లు ఎంపీటీసీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమయపాలన పాటిస్తేనే మస్తరు


ఉపాధి సిబ్బందిని నిలదీస్తున్న అధికారులు

కొత్తపల్లి: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల్లో కూలీలు సమయపాలన పాటిస్తేనే మస్తరు వేయాలని డ్వామా పీడీ వెంకటలక్ష్మి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద మంగళవారం 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జరిగిన ఉపాధి పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. 1025 పనులకు సంబంధించి రూ.11,13,44,708లను ఖర్చు చేశారని, కూలీలకు వేతనాల రూపంలో రూ.8,85,00,725, సామగ్రికి రూ.2,28,43,983 ఖర్చు చేశారని అధికారులు వివరించారు. కొన్ని గ్రామాల్లో కూలీలు పనిచేయకుండా ఫీల్డ్ అసిస్టెంట్లు మస్తర్లు వేయడం, మస్తర్లలో సంతకాలను దిద్దడం, ఇళ్ళ నిర్మాణంలో జరిగిన పనుల కంటే అదనంగా చెల్లించడం తదితర అంశాలను ప్రస్తావించారు. మూలపేటలో ఆశా కార్యకర్తకు మస్తరు వేయడాన్ని గుర్తించారు. గోర్సలో 342 మొక్కలు నాటినట్లు రికార్డుల్లో ఉన్నా ప్రస్తుతం ఒక్క మొక్క లేకపోవడాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఫీల్డ్ అసిస్టెంట్‌కు రూ.14,143తో పాటు మరో రూ.2 వేలు అపరాధ రుసుం విధించారు. ఉప్పాడ, వాకతిప్పలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల పర్యవేక్షణలో జరిగిన సీసీ డ్రైన్ నిర్మాణంలో కొలతలు తక్కువగా ఉండడంపై రూ.57,882 రికవరీ ఆదేశాలు జారీ చేశారు. పీడీ వెంకటలక్ష్మి మాట్లాడుతూ జరిగిన పనులపై స్థానిక ఫీల్డ్ అసిస్టెంట్‌లే పూర్తి బాధ్యత వహించాలన్నారు. ఏపీడీ వసంతమాధవి, అంబుడ్స్‌మెన్ జ్యోతి, ఎంపీడీఓ వెంకటనారాయణ, ఏపీఓ రాజబాబుతో పాటు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆంగ్ల భాష అవసరం ఎంతో ఉంది

సామర్లకోట: ఆంగ్ల భాష ప్రతి విద్యార్థికీ ఎంతో అవసరమని రైజ్ కోఆర్డినేటర్ జీవీ ప్రసాద్ అన్నారు. మండల పరిధిలో పవర జెడ్పీ హైస్కూల్‌లో రైజ్ విద్యార్థుల నైపుణ్యాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిషు మీడియంను అభివృద్ధి పరచడం వలన పేద విద్యార్థులకు మేలు జరుగుతుందన్నారు. ఇప్పటికే అనేక మంది డిగ్రీ చదివిన విద్యార్థులకు బయోడేటా పూర్తి చేయడం రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేటు సంస్థల్లో, ఇతర రాష్ట్రాల్లో ఉద్యోగ ప్రయత్నాలు చేయాలంటే తప్పని సరిగా ఆంగ్లంలో మాట్లాడవలసి ఉంటుందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ఆరో తరగతి నుంచి ప్రతి ఒక్కరూ ఆంగ్లం మాట్లాడటంపై శ్రద్ధ చూపాలని పిలుపునిచ్చారు. రైజ్ సభ్యులు శ్రీనుబాబు, జగన్మోహన్, రాజు పాఠశాల హెచ్‌ఎం ఎంవీవీ గోపాలరావు, ఇంగ్లీషు ఉపాధ్యాయుడు జీవీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. ఈ మేరకు విద్యార్థులు ఇంగ్లిషు నేర్చుకుంటామని ప్రతిజ్ఞ చేశారు.

పోలీసులకు ప్రజల సహకారం ఉండాలి


స్థానికులతో మాట్లాడుతున్న ఎస్పీ సతీష్‌కుమార్

పిఠాపురం: శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులకు ప్రజల సహకారం కచ్చితంగా ఉండాలని జిల్లా ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ అన్నారు. విలేజ్ విజిటింగ్‌లో భాగంగా ఆయన మంగళవారం పిఠాపురం మండలం మల్లాంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజల సహకారం ఉంటే ఎటువంటి సమస్యలు ఉండవన్నారు. యువత తాము ఎంచుకున్న రంగంలో ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు పాటుపడాలని సూచించారు. రైతులు చేపడుతున్న నూతన వ్యవసాయ విధానాలను, సాగు దిగుబడుల గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. అన్ని వేళలా తాను అందుబాటులో ఉంటానని, ఎవరికి ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకొచ్చి పరిష్కారం పొందొచ్చని ఆయన ప్రజలకు తెలియజేశారు. ఎస్పీ వెంట పిఠాపురం సీఐ శ్రీనివాస్, ఎస్ఐ గుణశేఖర్ తదితరులున్నారు.

ఘనంగా సనాతన ధర్మ ప్రచారం

పెద్దాపురం: దేవదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే సనాతన ధర్మ ప్రచార ప్రచార వారోత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. మరిడమ్మ ఆలయ ఈఓ సీహెచ్‌వీ రామ్మోహనరావు ఆధ్వర్యంలో మండలంలోని ఆర్‌బీ కొత్తూరు, వడ్లమూరు గ్రామాల్లో మేళతాళాలు, భజన బృందాలతో గరగల నృత్యాలతో ఆయా గ్రామాల్లో గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం సాయంత్రం మరిడమ్మ ఆలయంలో ఆలయాల విశిష్టత, చరిత్ర హిందూ ధర్మంపై అవగాహన కల్పించారు. దేవస్థానం వేదపండితులు, అర్చక స్వాములతో వేదపారాయణం, సామూహిక కుంకుమ పూజలు, విష్ణు సహస్రనామార్చన, లలితా పారాయణం నిర్వహించగా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నేడు కార్తిక మాసోత్సవాల సన్నాహక సమావేశం

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రంలో కార్తిక మాసోత్సవాల నిర్వాహణ ఏర్పాట్లపై చర్చించేందుకు బుధవారం భక్తులతో సమావేశం నిర్వహిస్తున్నట్లు ఈఓ డి.నాగమల్లేశ్వరరావు తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఉత్సవాలపై భక్తుల నుంచి సలహాలు, సూచనలు తీసుకోవడానికి ఉదయం 10 గంటలకు ఆలయంలో సమావేశం జరుగుతుందన్నారు. ట్రస్టు బోర్డు సభ్యులు, భక్త సంఘం నాయకులు, దీపారాధన సంఘ సభ్యులు హాజరు కావాలన్నారు.

మరిడమ్మకు మఖ నక్షత్ర పూజలు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన మరిడమ్మ అమ్మవారికి మంగళవారం మఖ నక్షత్ర పూజలు నిర్వహించారు. ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్‌వీ రామ్మోహనరావుల ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, చండీహోమంతో పాటు బంగారు, వెండి పుష్పాలతో పూజలు నిర్వహించగా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాపై సందేహాలు నివృత్తి చేసుకోవాలి

పెద్దాపురం: ఓటరు జాబితా డ్రాఫ్ట్‌పై సందేహాలు ఉంటే నివృత్తి చేసుకోవాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో జేఎస్ రామారావు కోరారు. స్థానిక ఆర్డీవో కార్యాలయ చాంబర్‌లో మంగళవారం ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై వివిధ రాజకీయ పార్టీల ప్రజా ప్రతినిధులకు సమావేశం ఏర్పాటు చేశారు. ఆర్డీవో మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఓటర్ల జాబితా రీ సర్వే మరింత వేగవంతంగా చేపట్టినట్టు తెలిపారు. జాబితా రూపకల్పనలో ఈ నెల 27న ఓటరు డ్రాఫ్ట్ వివరాల ప్రచురణ పూర్తైందన్నారు. నియోజకవర్గ పరిధిలో 2,08,930 మంది ఓటర్లు ఉన్నారన్నారు. వీటిలో పురుషులు 1,03,001 మంది, 1,05,916 మంది స్త్రీలు, 13 మంది ఇతరులు కూడిన జాబితాను ప్రచురించామన్నారు. సమావేశంలో తహసీల్దార్ వి.జితేంద్ర, మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర, మేనేజర్ జ్యోతిరాణి, జడ్పీటీసీ గవరసాని సూరిబాబు,(వైఎస్సార్ సీపీ), రంధి సత్యనారాయణ (టీడీపీ) చింతా శ్రీనివాసరావు (వైఎస్సార్ సీపీ)లతో పాటు ఆయా పార్టీల ప్రజా ప్రతినిధులు సిబ్బంది పాల్గొన్నారు.

కమ్యూనికేషన్ స్కిల్స్‌తో గుర్తింపు

సామర్లకోట: హైస్కూల్ స్థాయి నుంచి ఆంగ్లంలో కమ్యూనికేషన్ స్కిల్స్ పెంచుకోవాలని, తద్వారా కెరీర్‌లో మంచిగా స్థిరపడవచ్చని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత తోటకూర సాయిరామకృష్ణ అన్నారు. మంగళవారం సాయంత్రం రైజ్ ప్రోగ్రామ్‌ను పరిశీలించడానికి జిల్లా బృందం వచ్చింది. ఈ కార్యక్రమంలో రైజ్ సభ్యులతో పాటు ఉపాధ్యాయులు వి.రాజు, జి.గోవిందు, కేవీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో నలుగురికి జరిమానా

సామర్లకోట: డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో నలుగురికి కాకినాడ కోర్టు జరిమానా విధించినట్లు సీఐ కె దుర్గాప్రసాద్ మంగళవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మద్యం తాగి వాహనాలు నడుపుతున్న నలుగురిని అదుపులోకి తీసుకుని మంగళవారం కోర్టుకు తరలించినట్టు తెలిపారు. ఒకొక్కరికి రూ.10 వేల చొప్పున జరిమానా విధించినట్లు ఆయన తెలిపారు.

రాష్ట్ర కబడ్డీ జట్టుకు అవినాష్

సామర్లకోట: రాష్ట్ర స్థాయి కబడ్డీ జట్టుకు స్థానిక ప్రగతి జూనియర్ కళాశాల విద్యార్థి సింగంపల్లి అవినాష్ ఎంపికయ్యాడు. ఆ విద్యా సంస్థల చైర్మన్ ఎన్. పూర్ణచంద్రరావు మంగళవారం అతడిని అభినందించారు. కళాశాల ఏఓ సీహెచ్ ఆర్ సత్యనారా యణ మాట్లాడుతూ స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల నిడదవోలులో జరిగిన జిల్లా స్థాయి పోటీలో ఉత్తమ ప్రతిభ కనబర్చడంతో అవినాష్ రాష్ట్ర జట్టుకు ఎంపికైనట్టు తెలిపారు. అండర్ 19 విభాగంలో బెంగళూరులో జరుగనున్న నేషనల్ గేమ్స్ రాష్ట్ర కబడ్డీ జట్టు తరపున అతడు పాల్గొంటాడని తెలిపారు.

వైఎస్సార్ బీమా సాయం అందజేత

సామర్లకోట: స్థానిక బలుసులపేట 13వ వార్డుకు చెందిన దూల అప్పారావు ఆకస్మికంగా మృతి చెందడంతో ఆయన కుటుంబానికి వైఎస్సార్ బీమా సాయం రూ.లక్ష మంజూరైంది. ఈ మేరకు మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10 వేలు మంగళవారం ఆ వార్డు కౌన్సిలర్ నేతల హరిబాబు బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.